

## కథ

### జీవిత చిత్రం

**మల్లాది రవిశంకర్**

సమయం మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలవుతోంది.

పాతిక సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ నగరంలో అడుగుపెట్టాను. పాతికేళ్ళలో నగరం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

రెండు రోజుల నుండీ తిండి లేకపోవటంతో కళ్ళు తిరుగుతున్నాయ్.

దిక్కూ తెన్నూ తెలీనట్టు కాళ్ళు నడిపించిన వైపు నడుస్తున్నాను.

అలా నడుస్తుంటే రోడ్డుపక్కన ఒక గుడి కనిపించింది.

ఆ గుడిమెట్ల కింద పెట్టిన నల్లబోర్డుమీద తెల్లని అక్షరాలతో-

'నిత్యాన్నదానానికి అందరూ ఆహ్వానితులు' అని రాసి ఉంది.

మెల్లగా మెట్లెక్కి గుడిలోకి అడుగుపెట్టాను.

నాలాంటి ఎందరో అన్నార్తులు పంక్తిభోజనానికి కూర్చున్నారు. క్రమబద్ధంగా అందరినీ కూర్చోబెట్టి విస్తర్లలో భోజనం వడ్డిస్తున్నారు. వెళ్ళి ఒక ఖాళీ విస్తరి ముందు కూర్చున్నాను.

వడ్డన పూర్తయింది.

ఒక భక్తుడు ముందుకొచ్చి-

''పాతిక సంవత్సరాలుగా ఈ నిత్యాన్నదాన కార్యక్రమం నిరాటంకంగా సాగిపోతోంది. పాతికేళ్ళ క్రితం జ్ఞాన సముపార్జనకి హిమాలయాలకి వెళ్ళిన మన బాబా తిరిగి రాలేదు. ఆయన వెడుతూ, మాపై ఉంచిన గురుతర బాధ్యతని మనసా వాచా నెరవేరుస్తున్నాం. వారికోసం మా కళ్ళు చకోరాల్లాగా ఎదురుచూస్తున్నాయ్. ఆ తిరుచరణాలని తాకాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఆ సుదినం ఎప్పటికొస్తుందో? ఆయన ఆదేశాల మేరకు జరిగే ఈ అన్నసంతర్పణలో పాల్గొంటున్న మీరంతా కడుపారా భోజనం చెయ్యండి. అన్నాన్ని పారవెయ్యద్దు. అది పరబ్రహ్మస్వరూపం. భోజన కాలే హరి నామ స్మరణ..గోవిందా..గోవిందా'' అని చెప్పి అందరినీ భోజనం ప్రారంభించమన్నారు.

ఆకలికి కళ్ళు తిరిగినట్టుండడంతో ఆయన మాటలు నా బుర్రకెక్కలేదు.

అన్నదే తడవుగా భోజనం చెయ్యటం మొదలుపెట్టాను. రుచికరమైన భోజనం అమృతతుల్యంగా అనిపించింది.

భోజనం చేస్తున్న నా దృష్టి గుడిలో ఫోటోవైపుకెళ్ళింది.

గుడిలోపల ఎవరో బాబా నిలువెత్తు ఫోటో, దాని పక్కన ఎవరో చేతితో కాన్వాస్‌మీద చిత్రించిన సాయిబాబా చిత్రం.

తింటున్న చేతులు అప్రయత్నంగా ఆగిపోయాయి.

ఇంక అన్నం అంతగా సయించలేదు.

మనసు పొరల్లో ఎన్నెన్నో జ్ఞాపకాలు..

భోజనం ఎలాగో ముగించి చేతులు కడుక్కున్నాను.

అప్రయత్నంగా సాయిబాబా ఫోటోకి, వీళ్ళు కొలుస్తున్న బాబా ఫోటోకీ చేతులు జోడించాను.

మెల్లగా మెట్లు దిగి రోడ్డుమీది కొచ్చాను.

మనసు గతంలోకి పరుగుపెట్టింది.

★ ★ ★

రైలు దిగి గంటసేపయినా గుండె దడదడలాడుతూనే ఉంది. కళ్ళ ముందు ఇంకా కర్రలూ, లాంతర్లూ పట్టుకొని వెంబడిస్తున్న ఊరిజనం కనిపిస్తున్నారు. క్రూరమైన కళ్ళతో, దొరికితే గొడ్డును బాదినట్టు బాది, పాముని ప్రాణం పోయేదాకా కొట్టి చంపినట్టు కొట్టాలనే కసి వాళ్ళ కళ్ళల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

తను చేసిన తప్పేమిటో, వాళ్ళెందుకు తనని వెంటాడుతున్నారో ఇప్పటికీ అర్థంకాని ప్రశ్నే.

తను ఒక చిత్రకారుడు. వేసిన ప్రతి చిత్రంలోనూ జీవకళ ఉట్టిపడేటట్టు గీయటం తనకి దేవుడిచ్చిన వరం.

తన వాళ్ళంటూ ఎవరూ లేని తనకు, ఈ కళే ఊపిరిగా తోస్తుంది.

కుంచెని వడుపుగా పట్టిన వ్రేళ్ళు, చూసిన రూపంలో చైతన్యాన్ని తెచ్చిపెడతాయి.

ఆరోజు...

సర్పంచిగారి అమ్మాయి అడిగింది-

''అన్నా! నా బొమ్మ వేస్తావా? అమెరికాలో ఉన్న బావకి స్కాన్ చేయించి పంపిస్తాను'' అంటూ.

ఈ పిల్ల ఇంట్లోవాళ్ళకి ఇష్టంలేకపోయినా బావమీదే మనసు పారేసుకుంది.

''అన్నా'' అన్న ఆమె పిలుపు, ఆమె కోరికని కాదనలేనట్టు చేసింది.

ఆమె కోరిక మేరకు ఊరి చివర రైలుకట్ట దాటి జలపాతాల దగ్గరికి చేరుకున్నాం.

మోకాళ్ళలోతు నీళ్ళల్లోకి దిగి, కళ్ళమీద చేతులు పెట్టుకొని, చిత్రం కోసం పోజు పెట్టింది.

ఆమె బొమ్మ గీయటం మొదలుపెట్టాను.

ఈ వార్త ఎవరు, ఎలా మోసుకెళ్ళి సర్పంచిగారికి చెప్పారో తెలీదు.

దాని పర్యవసానం కర్రలతో, కత్తులతో దాడికొస్తున్న ఊరిజనం.

దూరంలో ఉండగానే వారినీ, వారి ఆవేశాన్నీ గుర్తించాను. ఆపద ముంచుకొస్తోందని మనసు హెచ్చరించింది. కుంచెలనీ, రంగులనీ భుజానికి తగిలించుకున్న సంచీలో పెట్టుకొని రైలుకట్టవైపుగా పరిగెత్తసాగాను.

ముందు నేను...

వెనక..

మేకమీద కురికే పులుల్లాగా ఊరిజనం.

నా అదృష్టం బాగున్నట్లుంది. నగరం వెళ్ళే రైలు నాకోసం ఆగినట్టుగా ఆగింది. పరిగెత్తుకొని రైలెక్కేశాను. నేను ఎక్కినదే తడవుగా రైలు బయల్దేరి వేగం పుంజుకుంది.

దూరంగా ఊరి జనం కనిపిస్తూ, కాసేపటికి అదృశ్యమయ్యారు.

తెల్లవార్లూ కంటిమీద కునుకు లేదు.

ఏ ఆపద ఎటువైపునుండి వస్తుందోనని ఒకటే కంగారు.

తెల తెల వారుతుండగా రైలు నగరం చేరుకుంది.

రైలు దిగి బయటికి దారితీశాను.

కొంత దూరం నడిచిన తర్వాత, పేవ్‌మెంట్‌కి ఒక మూల విశాలమైన వేపచెట్టు కనిపించింది.


వెళ్ళి దానికానుకొని కూర్చున్నాను.

ఎందుకో కూర్చున్న కాసేపటికి-

సాయిబాబా చిత్రం గీయాలనే కోరిక కలి

గింది.

వెంటనే కాన్వాసూ, కుంచెలూ తీసి నా కళ్ళ ముందు కదలాడే ఆ కరుణామూర్తి సజీవ చిత్రాన్ని చిత్రించటం మొదలుపెట్టాను.



చిత్రం గీయటం ముగించి, నుదుటన పట్టిన చెమట విదిలించి రోడ్డువైపు చూశాను.

ఒక యువకుడు పాదరక్ష లిప్పి నేను వేసిన బాబా చిత్రానికి దణ్ణం పెడుతు న్నాడు. అతని చేతుల్లో ఫైలు చూస్తే బహుశా నిరుద్యోగి అనిపించింది.

ఎందుకో నా నోటి నుంచి అనుకోకుండా-

''నీకు తప్పక ఈ రోజు ఉద్యోగం దొరుకుతుంది. ధైర్యంగా వెళ్ళిరా'' అన్నాను.

అతను సంతోషంగా, జేబులోంచి వంద రూపాయల కాగితం తీసి బాబా చిత్రం ముందుంచి వెళ్ళిపోయాడు.

కొద్దిసేపటికి-

ఒక పెళ్ళికాని పాతికేళ్ళ పిల్ల వచ్చింది. ఆమె కూడా నా చిత్రం ముందు ఆగి బాబాకి మ్రొక్కింది.

మళ్ళీ నా నోటి నుండే-

''ఈరోజు నీకు జరిగే పెళ్ళి చూపులు నీకు యోగ్యమైనవి. తప్పకుండా సంబంధం కుదురుతుంది. నిశ్చింతగా వెళ్ళమ్మా!'' అని చెప్పాను.

ఆమె ఆనందంగా నా వైపు చూసి, బాబా చిత్రపటం ముందు వంద రూపాయలు ఉంచి వెళ్ళింది.

ఆరోజు దాదాపు పదిమంది వచ్చి బాబాకి మ్రొక్కారు.

అందరికీ బాబా పలికించినట్టే ఏదో చెప్పాను.

సాయంత్రానికి వెయ్యి రూపాయలు పోగయ్యాయి.

నగరంలో నా మొదటిరోజు సంపాదన. పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఒక్కసారిగా చూడనంత ధనం.

పడమటికి కృంగబోతున్న సూర్యకిరణం నా సజీవ చిత్రంపై పడుతోంది.

చీకటి వెలుగుల సంజె చీకట్లు బాబా చిత్రం పై దోబూచులాడుతున్నాయ్.

దగ్గరలో దుకాణం నుండీ ఒక కొవ్వొత్తి తెచ్చి బాబా ముందు వెలిగించాను.

సమయం ఎనిమిది దాటుతోంది.

వేపచెట్టుకి ఆనుకొని అలసటగా కళ్ళు మూసుకున్నాను. క్రితం రాత్రంతా నిద్రలేకపోవటంతో కళ్ళు మండుతున్నాయ్.

''అయ్యా! అయ్యా!'' అన్న పిలుపునకు కళ్ళు విప్పాను.

నా కాళ్ళ దగ్గర ఉదయం వచ్చిన కుర్రాడు మోకరిల్లాడు.

''మీ దయవల్ల నాకు ఉద్యోగం వచ్చింది. నెలకి పాతికవేల జీతం. నా మొదటి నెల జీతం బాబాకే అర్పిస్తాను. అమ్మతోడు'' అంటున్నాడు అతను.

అతను ఇంకేదో మాట్లాడుతుండగానే-

ప్రొద్దున బాబాకి మ్రొక్కిన పెళ్ళికూతురు తల్లి దండ్రులతో వచ్చింది.

''బాబా! మీ నోటి మాటల చలవ వల్ల పిల్లకి పెళ్ళి కుదిరింది. చంద్రునికో నూలుపోగు అన్నట్టు మా సంతోషం'' అంటూ తాంబూలంలో డబ్బులు పెట్టి నా చేతిలో పెట్టారు.

వాళ్ళిద్దరూ అక్కడ ఉండగానే ఇంకొకడు వచ్చాడు.

''మీ దయవల్ల ఎంతకాలంగానో వసూలు కాని మొండి బాకీ వడ్డీతో సహా చేతికందింది బాబా! నా సంతోషం స్వీకరించండి'' అంటూ నా చేతిలో డబ్బులకట్ట పెట్టాడు.

నిన్న ఈ సమయానికి ముందు-

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని, బ్రతకటం కోసం పారిపోయిన నేను...తిండి దొరకని రోజు, వీధి కుళాయి నీళ్ళతో కడుపునింపుకున్న నేను....

ఈ రోజు...

ఈ కొద్ది గంటలలోనే వేలు సంపాదించాను.

ఇది నా చిత్రకళకి జనం కట్టిన విలువా? లేక బాబా మహిమా?

నిన్నటిదాకా బండరాయిలా బ్రతికిన నాకు ఒక్కరోజులోనే ఇంత గుర్తింపా?

ఆరోజు వచ్చిన నడిమంత్రపుసిరితో, నలుగురు అన్నార్తులకి అన్నదానం చేశాను.

మనసు అపరిమితానందం పొందింది.

నీడనిచ్చిన వేపచెట్టుకిందే నడుం వాల్చాను.

నగరంలోని వాహనాల మ్రోత ఇంకా పూర్తిగా సద్దుమణగలేదు. ఆకాశంలో తారల్ని చూస్తూ ఎప్పుడు నిద్రకొరిగానో తెలీదు.

తెల్లవారింది.

దూరంగా ఉన్న వీధి కుళాయి క్రింద స్నానాదికాలు ముగించుకొని వస్తుంటే-

నాకోసం ఎదురుచూస్తున్న చిన్న గుంపు...వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి.

''ఆయన మాటల్లో సత్యం వుందట. నిన్న మా ఫ్రెండ్‌కి ఉద్యోగం వస్తుందని, ఈయన చెప్పిన వెంటనే వాడికి మంచి ఉద్యోగం వచ్చింది. రెండేళ్ళనుండీ చిల్లకానీకి విలువ చెయ్యని వాడి తెలివిని నిన్న గుర్తించి, పాతివేల ఉద్యోగం దొరికింది'' అని ఒకళ్ళు చెబుతుంటే...

''మా పక్కమ్మాయికి కుజ దోషం. నాలుగేళ్ళుగా ఒక్క సంబంధం కూడా కుదరని ఆ పిల్లకి, నిన్న ఈ బాబా చెప్పారట నీకు మంచి సంబంధం కుదురుతుందని. అంతే...గుర్రంమీద రాజకుమారుడు, వరకన్యని వెదుక్కుంటూ వచ్చినట్టు, బంగారంలాంటి సంబంధం కుదిరింది..''

ఇలా అందరి నోటా తలో కథ.

బాబా! అంటూ తనకి మ్రొక్కుతున్నారు.

ఒక్కరోజులోనే తనని బాబా చేసేశారు జనం.

నిన్నటి సంఘటనలతో ప్రజల్లో తన పట్ల, తన మాటలపట్ల నమ్మకాన్ని కలిగించాయి.

నా కళ్ళ ముందు కనిపిస్తోంది.

తండోపతండాలుగా జన సందోహం.



కొందరికి సమస్యలూ, కొందరికి కోరికలూ, కొందరికి సందేహాలూ, మరికొందరికి అత్యాశలూ..

తనూ వాళ్ళందరిలాంటి మామూలు మనిషే. ఏ మహిమలూ లేని ఒక మామూలు మనిషి మాత్రమే. నిన్న వాళ్ళ సమస్యలు గుర్తించి ఏదో మంచి ముక్క చెప్పటం కేవలం యాదృశ్చికమే.

ఈ విషయం వాళ్ళకు చెపితే వాళ్ళు నమ్మరు. నిరుత్సాహపడతారు. ఇంకా ఇంకా డబ్బు కురిపిస్తారు.

అందుకే నేను ఎంచుకున్న మార్గం మౌనం.

రోజుకి ఏ ఒక్కరికో ఇద్దరికో తప్పించి ఎవరితోనూ మాట్లాడేవాడిని కాదు. మనసులో అనుకునేవాడిని. 'వాళ్ళకే మంచి చెయ్యగలిగితే, ముందు నాకే మంచి చేసుకునే వాడిని కదా!' వాళ్ళ మూఢనమ్మకం చాలా సందర్భాల్లో సంతోషంగా వుండేది నాకు. వాళ్ళ నమ్మకం నాకొక వినోదంగా వుండేది.

కొందరిని ప్రేమగా తాకేవాడిని. కొందరి వంక చిరునవ్వుతో చూసేవాడిని. భక్తులు దానికే పొంగిపోయేవారు.

శ్రీచరణాలంటూ పాదపూజలు చేసేవారు.

మనసులో అంతర్మథనం మొదలయింది కొంతకాలం తర్వాత

తానెవరు?

తనని బాబా అని కొలుస్తున్నారు. కాషాయం కట్టబెట్టారు. కనకవర్షం కురిపిస్తున్నారు. తను ఉంటున్న వేపచెట్టుకింద ఒక చిన్నగుడి వెలిసింది. తన దర్శనానికి తండోపతండాలుగా ప్రజలు.

ప్రతిక్షణం మనసుకీ, తప్పక చేయాల్సిన ప్రవర్తనకీ మధ్య అంతర్మథనం.

ఎన్నో సందర్భాలలో అనిపించింది.

ప్రజలకి నిజం చెప్పెయ్యాలని..కానీ ఆ అవకాశమే ఇవ్వలేదు వీళ్ళు.

తను కూర్చునే పేవ్‌మెంట్ ఎదురుగా కొత్త సినిమా పోస్టర్ అంటించారు.

మహేష్‌బాబు, నయనతారల కొత్త సినిమా.

మనసు ఎలాగైనా సినిమా చూడాలని పీకుతోంది.

నగరం సద్దుమణిగాక రెండో ఆటకి గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళాలనుకున్నాను.

సినిమా సమయం అవుతుండగా మామూలు బట్టలతో సినిమాహాల్

## అప్పుడే పెళ్లేంటీ?

తెలుగు నుంచి తమిళానికి ఆ తర్వాత హిందీ సినీరంగానికి కూడా వెళ్లింది సదాఫ్ ఉరఫ్ సదా. ఆమె ప్రస్తుతం 'అఆఇఈ' అనే తెలుగు చిత్రంతోపాటు రెండు హిందీ సినిమాల్లోనూ నటిస్తోంది. ఈమధ్య స్టార్‌రేస్‌లో కాస్త వెనకబడిన సంగతి వాస్తవమే గనక ఇక ఆమె పెళ్లి చేసేసుకుంటుందనే వార్తలు ఇటీవల గుప్పుమన్నాయి. దీనికి సదా వెంటనే స్పందించింది. 'అప్పుడే నాకు పెళ్లేంటీ? ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. నా దృష్టంతా నా సినీ కెరీర్ మీదే వుందిప్పుడు' అంటూ విషయాన్ని ఆదిలోనే తేల్చిపారేసింది.

చేరుకున్నాను.

అలవాటుకొద్దీ నేల టికెట్టు క్యూ వైపు వెడుతుంటే ఎవరో గుర్తుపట్టనే పట్టేశారు.

జనంలో కలకలం.

థియేటర్ యాజమాన్యం అప్పటికప్పుడే పూర్ణకుంభంతో స్వాగతం పలికే ఏర్పాట్లు చేశారు.

''మీ చరణాలతో మా థియేటర్ పావనమయింది. మా మీద మీ కటాక్ష వీక్షణాలతో మమ్మల్ని ఆశీర్వదించటానికి ఇంతదూరం వచ్చిన మీకు నమస్సుమాంజలులు'' అన్నారు.

చిల్లర మనసు అనుకొంది...

మహేష్‌బాబు సినిమా చూడాలని వచ్చినా, చూడనివ్వటం లేదు. వాడు స్క్రీన్ మీద కనిపించగానే గట్టిగా విజిల్ వేద్దామనుకున్నానని

థియేటర్ యజమాని కార్లో తీస్కొచ్చి నా 'గుడి' దగ్గర దింపి, ఆరోజు కలెక్షన్ అంతా నా పాదాల చెంత భక్తిగా పెట్టాడు.

అది చాలనట్టు మర్నాటినుండీ అన్ని వాల్‌పోస్టర్ల మీదా 'బాబా' ఆశీస్సులతో అని నా ఫోటో వేయించాడు.

దాని పర్యవసానం.

జనం విరగబడి సినిమా చూస్తున్నారు. తనని అడ్డంపెట్టుకొని వ్యాపారం చేస్తున్నాడు.

తను మాత్రం ఏం చేస్తున్నాడు?

జనాల భక్తి అనే బలహీనతలో పబ్బం గడుపుతున్నాడు. వాళ్ళ ఆశ అనే అవకాశాన్ని అడ్డంపెట్టుకొని వాళ్ళని మోసం చేస్తున్నాడు.

ఆత్మవిమర్శ చేసుకోవటం మొదలుపెట్టాను.

అమ్మా, అయ్యా లేని అనాథ బ్రతుకు ఇంతటి మనస్తాపాన్నివ్వలేదు.

బ్లాక్‌లో సినిమా టిక్కెట్లమ్మి పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నరోజు ఇంతటి బాధ కలగలేదు.

బ్రతకాలని, వెంటాడే జనం నుండీ గుండెల్లో ప్రాణాలు పెట్టుకొని పారిపోయిననాడూ ఇంతటి వ్యధ కలగలేదు.

ఈరోజు..

ప్రజలని మోసం చేసి లక్షలు సంపాదిస్తున్నాననే నిజం కొండంత బాధ కలిగిస్తోంది. తను తినే ప్రతి అన్నం మెతుకూ అంకుశంలాగా అనిపిస్తోంది.

తను ఈరోజు ఆరగిస్తున్న పంచభక్ష్యపరమాన్నాలకన్నా, గతంలో ఆకలితో తాగిన కుళాయి నీళ్ళే మధురంగా అనిపిస్తున్నాయి.

మనసు గతంవైపూ...అలాంటి జీవితం వైపే లాగుతోంది.

ప్రజలు ఇంతకాలం తనకి కట్టబెట్టిన లక్షల రూపాయల నమ్మకాన్ని మూటలు కట్టి రాత్రికి రాత్రే ఈ నగరం వదిలి పారిపోవాలా? అలా చేస్తే జీవితాంతం డబ్బుకి ఎలాంటి ఇబ్బందీ వుండదు.

మనసు ఆ పని చెయ్యటానికి ఎంతమాత్రం అంగీకరించలేదు.

తన భవిష్యత్ ఆలోచన మెల్లగా రూపుదిద్దుకొంది.

మర్నాడు, భక్తులనుద్దేశించి ఒక సందేశం ఇచ్చాను.

''భక్తులారా! ఈమధ్యకాలంలో నా మనస్సు ఎందుకో చాలా అల్లకల్లోలంగా ఉంటోంది. మది మరింత జ్ఞానాన్వేషణ కోసం ఉవ్విళ్ళూరుతోంది. మహాత్ముల సాంగత్యం, పుణ్యక్షేత్ర దర్శనం చెయ్యాలని. అందుకే తలపెట్టాను. హిమాలయాల్లో నివసించే ముముక్షువులతో కలిసి, నా జ్ఞానాన్వేషణ కొనసాగిస్తాను. నా జ్ఞానయజ్ఞం ముగిసిందనిపించిననాడు మళ్ళీ మీ దగ్గరకొస్తాను. అంతవరకూ... మనం ఇప్పుడు సాగిస్తున్న సేవా కార్యక్రమాలు కొనసాగాలి. ఆకలితో ఈ గుడిమెట్లెక్కిన ప్రతి అన్నార్తునికీ కడుపారా అన్నం పెట్టాలి. మీరు నాకు ప్రేమతో ఇచ్చిన ప్రతి పైసా ఇక్కడే, మీకే వదిలి వెడతాను. ఆ డబ్బులతో ఈ కార్యక్రమాలు ముందుకు నడిపించాలి. రేపే నేను ఇక్కడినుండీ బయల్దేరుతున్నాను'' అని నా సుదీర్ఘ ఉపన్యాసాన్ని ముగించాను.

''బాబా! మీతో మేమూ వస్తాము'' అన్నాయి కొన్ని కంఠాలు.

''బాబా! నీ భక్తులను ఇలా అంధకారంలో వదిలి వెళ్ళిపోతావా?'' అన్నాయి మరికొన్ని కంఠాలు.

సాయంత్రం అయ్యేసరికి గుడి జనసందోహంతో నిండిపోయింది. బాబా మళ్ళీ ఎప్పుడు వస్తారో? అని ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు.

రాత్రంతా అలాగేసాగింది.

తూర్పున తెల్లవారింది.

నేను ఇంతకాలం సంపాదించిన ధనం కొందరు భక్తులకప్పగించా..సేవా కార్యక్రమాలు ఇప్పటిలాగానే కొనసాగాలని వారిని ఆదేశించా.

నేను ఈ నగరం వచ్చినరోజు వేసుకున్న బట్టలూ, భుజాన తగిలించుకున్న సంచీ మాత్రమే తీసుకున్నాను. జేబులో చిల్లిగవ్వ కూడా పెట్టుకోలేదు. జేబులు ఖాళీగా వున్నా మనసు ఉల్లాసంగా, ప్రశాంతంగా వుంది. అలాగే భక్తసందోహాన్ని దాటుకుంటూ ఒంటరిగా, జనారణ్యంలోకి అడుగుపెట్టాను.

* * *

గతంలోంచి మళ్ళీ వాస్తవంలోకి వచ్చాను.

బాబాగా అవతారం చాలించి జనారణ్యంలోకి వెళ్ళిన నేను, ఇంతకాలం మనసుకి నచ్చినట్టుగా స్వేచ్ఛగా బ్రతికేశాను.

గతించిన ఈ పాతికేళ్ళలో నేను సంపాదించిన సంపాదనేం లేదు. అలాగే పోగొట్టుకున్నదేమీ కూడా లేదు. మళ్ళీ కుంచె తాకలేదు. ఎవ్వరికీ భవిష్యవాణి చెప్పలేదు.

పెళ్ళి చేసుకోలేదు. అలా అని బ్రహ్మచారిగానూ బ్రతకలేదు.

ఇంతకాలం తర్వాత...

మళ్ళీ తలవని తలంపుగా, ఆరోజు నాచుట్టూ అల్లుకున్న గుడిలోకే ఆకలితో అడుగుపెట్టాను.

అదృష్టవశాత్తూ నన్నెవరూ గుర్తించలేదు.

ఇప్పుడు నా ముందు రెండు దారులు కనిపిస్తున్నాయి.

మళ్ళీ బాబా అవతారంలో ప్రజలను మభ్యపెడుతూ గుడిలోకి అడుగుపెట్టాలా? లేక -

అక్కడ జరుగుతున్న మంచి పనుల్లో తలదూర్చకుండా నా దారిన నేను వెళ్ళిపోవాలా?

భక్తులు మళ్ళీ బాబా వస్తారని ఎదురుచూస్తున్నారు. ఆకలిగొన్న ఎందరో నాలాంటి అన్నార్తులకి ఆదరంగా పెడుతున్నారు. సేవా కార్యక్రమాలు చక్కగా సాగుతున్నాయి. ఇంతకుమించి, నాలాంటి సామాన్యునికేం కావాలి?

వాళ్ళ గుండెల్లో నా మీదా, నా మహిమల మీదా ఎనలేని నమ్మకం. ఆ స్థాయికి నేనెప్పటికీ ఎదగలేను.

కడుపులో బాగా ఆకలివేసి, ఎక్కడా పిడికెడు అన్నం కూడా దొరకని నాడు, కుళాయి నీళ్ళతో కడుపునింపుకుంటూ, నా గుడిలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటే...నిండిపోదా ఖాళీ కడుపు...

ఒక దృఢ నిశ్చయానికి వచ్చినట్టు గుడిదాటి ముందుకూ, మున్ముందుకూ నేనెంచుకున్న స్వేచ్ఛాజీవనం వైపుగా సాగిపోయాను.

☆

